# పువ్వులన్నీ పూజకే....

'ఆ అమ్మాయికి ఎంత పొగరు???' —

చాలా సీరియస్ అయిపోయాడు — బజారు చక్రవర్తిగా పేరు సంపాదించుకుని, అదో గొప్పతనంగా మురిసిపోతున్న జగన్నాద్

ఆ బజారులో జగన్నాద్ అంత వేగంగా—సైకిల్‌గానీ మోటారు సైకిల్‌గానీ నడపగల ధీరుడింతవరకు పుట్టలేదు ఎంత రద్దీవున్నా సునాయాసంగా వెళ్ళిపోతాడు. అతని వేగానికి—వెళ్ళేవెళ్ళే మనిషి టక్కున ఆగి ఓ క్షణం చూసి వెళ్ళవలసిందే!

'ఎవరండీ అతను?'

'ఆఁ—ఎవరో, 'బజారు వెధవ!' — బాటసారుల సంభాషణ యిదీ జగన్నాధ్ గూర్చి.

జగన్నాధ్ బి.ఏ., చదువు పూర్తి చేసి యస్.ఐ. ఉద్యోగం మొదలు కొని, ఎక్స్ట్రా డిపార్ట్‌మెంట్ వరకు ప్రయత్నించాడు. కానీ, ఫలితం శూన్యం.

తనకు ఉద్యోగం లభించకపోవడం ప్రభుత్వం అసమర్థతే కానీ, తన ఎబిలిటీ లోపం మాత్రం కాదనే నిర్ధారణకు వచ్చాడు. పెద్దవాళ్ళ సంపాదన తింటూ, తెగబలిసి—రోడ్లు సర్వే చేయడం, అమ్మాయిలను ఏడిపించడం హాబీ అనుకుని ఉద్యోగం వచ్చేవరకు అదే తన ఉద్యోగంలా, సాటి వర్గంలో 'బజారు చక్రవర్తి'గా బిరుదు పొందాడు.

అతనికి అనుకోకుండా ఓ మెరుపులాంటి అమ్మాయి తారసిల్లి, కొరడా దెబ్బలాంటి మాట అంది అందుకే అవాళ అంత సీరియస్ అయిపోయాడు జగన్నాథ్.

*　　　*　　　*

అసలేం జరిగిందంటే—

ఓ రోజున 'అనిత'లో ఈవినింగ్ షో సినిమా చూసుకొని వస్తున్న జగన్నాథ్‌కు, ముందుపోతున్న రిక్షాలోంచి పాల నురుగులాంటి ఓ తెల్లని చీర చెరుగు రెపరెపలాడుతూ కనిపించింది. రిక్షా వెనక్కు వెళ్ళగా 'మల్లెపూల' వాసన ఘుమ్మని స్వాగతం చెప్పింది. అంతే తన సైకిల్ ముందుచక్రాన్ని ఆ రిక్షాకు స్పీడుగా "ఢీ" కొట్టాడు లాఘవంగా. మలుపు తిరగబోతున్న రిక్షా పడబోయింది. సైకిల్ దిగి, ప్రక్కకు వాలుతున్న రిక్షాను పట్టుకొని ఆపి, అందులోంచి కింద పడబోయిన ఆ తెల్లచీరలోని ఎర్రటి అమ్మాయిని చేతుల్లోకి తీసుకున్నాడు. అంతా గమనించిన ఆ అమ్మాయి ఉరికి, నిలదొక్కుకుని, "యూ బ్రూట్!" అంటూ చెప్పు చేతికి తీసుకుంది.

పట్టలేని ఆవేశం వచ్చింది జగన్నాథ్‌కు ఆ తెల్లచీర తోడువున్న తమ్ముడు ఏడవ నారంభించడం అటుకేసి జనం రావడంతో సైకిల్

మీద జోరుగా జారిపోయాడు మారో మార్గంలేక. అందుకే అవాళ అంత సీరియస్ అయిపొయ్యాడు.

*           *           *

తెల్లచీరలోని ఆ అమ్మాయి పేరు అరుణ. కాలేజీలో బి. యస్సీ, చదువుతోంది. రోజూ ఇంటినుండి కాలేజీకి సైకిల్ మీదే వెళుతుంది. ఆ అమ్మాయిని గూర్చిన వివరాలు సేకరించాడు.

"అయితే మరేం, దొరికింది—" అనుకున్నాడు జగన్నాథ్.

"లేకపోతే—నన్ను—నన్ను పట్టుకుని అంతమాట అంటుందా?? చెప్పు చేతికి తీసుకుంటుందా?? ఎంత ధైర్యం???"

*           *           *

కాలేజీ రోడ్డుమీద కాపుకాశాడు జగన్నాథ్. కారాకిళ్ళి కళ్ళల్లోకి ఎరుపును ఎక్కించింది. సైకిల్ మీద వస్తూ దూరాన కనిపించిన అరుణ.... జగన్నాథ్ కళ్ళకు పొగరుపట్టిన గుర్రంలా కనిపించింది.

అంతే!

సైకిల్ ఎక్కేశాడు. పక్కనున్న సోదరులు-కం-నేస్తాలు 'విష్ యూ ఆల్ ది బెస్ట్' అన్నారు.

సైకిల్ 'సూపర్ మార్కెట్' దాటి వచ్చేసింది. జగన్నాథ్ సైకిల్ వేగాన్ని అందుకుంది. అరుణ సైకిల్ "గంగాధరం హొటల్" సమీపానికి వచ్చింది. ఎదురుగావచ్చిన సైకిల్‌ను తప్పుకోబోయింది.

"ధన్—" అరుణ సైకిల్‌ను గుద్దేశాడు జగన్నాథ్. సైకిల్ ఒక ప్రక్క, ఆ అమ్మాయి మరోప్రక్క పడిపోయ్యారు. తోక తొక్కిన త్రాచులా తలతిప్పి చూచిన ఆమె చూపు....ఓ క్షణం అతన్ని అచేతనుణ్ణి చేసింది. అప్పటివరకు నోటినిండా వూరిన కారాకిళ్ళిని ఉమ్మేశాడు.

"ఇప్పటికైనా తెలుసుకో! నేనీ బజారుకు చక్రవర్తిని నన్నెదిరించి ఎవరూ నిలువలేరు"— అంటూ సైకిల్ ఎక్కాడు మెరుపులా.

జగన్నాథ్ ఫ్రెండ్స్ చుట్టూజేరి కిలకిల నవ్వారు.

అరుణ రోషంతో సర్దుకొని లేస్తూ—దూరాన పడివున్న చెప్పును అందుకుంది, "యూ బ్లడీ రోగ్" అంటూ.

అప్పటికే జగన్నాథ్ అదృశ్యమయ్యాడు.

అంతా క్షణాలమీద జరిగిపోయింది.

*   *   *

"అన్నయ్యా! అన్నయ్యా!! ఇవాళ అమ్మ స్వీట్ చేసింది"—అంటూ గుమ్మంలోకి ఎదురొచ్చింది రజని

'ఏమిటి విశేషం?' సైకిల్ లోపలపెట్టి, చెల్లెల్ని ప్రశ్నించాడు జగన్నాథ్. రజని సిగ్గుతో మొగ్గయిం .

'ఆడపిల్ల అదెలా చెబుతుం .రా? అమ్మాయి పెళ్ళిచూపుల కొస్తున్నారు' అంటూ వెళ్ళింది జానకమ్మ ఒక్కగానొక్క చెల్లెలు-రజనికి పెళ్ళిచూపులు—జగన్నాథ్ హృదయం ఆనందంతో నిండిపోయింది.

'అందుకా ఆ హుషారు?' అన్నాడు కొంటెగా

"హో అన్నయ్యా!" అంటూ దోసిట్లో ముఖం దాచుకుంది రజని.

'రజనీ!'

కళ్ళెత్తి అన్నయ్యదెస చూసింది.

'ఇలా రా—' రజని దగ్గరికొచ్చి నిలుచుంది. 'వచ్చేది సురేష్ కదూ?'

'ఊహూ! నేచెప్పను' అంటూ నవ్వుతూ తుర్రున వెళ్ళిపోయింది రజని.

'సురేష్, రజని - ప్రేమకథ తనకు తెలుసు. సురేష్‌ను తప్ప మరెవరినీ పెళ్ళిచేసుకోలేనని రజని నిక్కచ్చిగా చెప్పింది కూడా అమ్మతో. సురేష్ కూడా వాళ్ళ తల్లిదండ్రులతో చెప్పి, ఈ పెళ్ళిచూపులకు తీసుకొస్తున్నాడన్నమాట!' – జగన్నాథ్ సంతృప్తిగా శ్వాస పీల్చుకొని, తన గదిలోకి వెళ్ళాడు.

* * *

నేస్తం ఇంటికొస్తున్న రజనిని బజారులో ఎవరో బలంగా గుద్దేశారు. క్రింద పడిపోయిన రజని పైకి లేవలేకపోతోంది. అసహాయంగా చూస్తూ, బిగ్గరగా ఏడుస్తోంది. జనం చుట్టూ చేరి, తమాషా చూస్తూ నవ్వుతున్నారు.

"సిమ్లా హోటల్లో" బిరియానీ బిర్రుగా మెక్కి, కింగ్‌సైజ్ సిగరెట్‌ను పెదాలమధ్య బిగించి, సైకిల్ ఎక్కిన జగన్నాథ్ ఆ జనంగుంపు దగ్గర ఆగాడు.

"ఏయ్! ఏమిటిది?" ఎవరినో పిలచి నిర్లక్ష్యంగా అడిగాడు.

'ఎవరో ఆడకూతురు రోడ్డునపడి ఏడుస్తూ వుంది.' ఆ జవాబులో ఆనందం ధ్వనించింది వింతగా.

"ఏమయింది?"

"ఆఁ.... ఉంటారుగా అడ్డగాడిదల్లా తిరిగే బజారు చక్రవర్తులు. ఎవడో గుద్దేశాడు—కళ్ళకు కొవ్వెక్కి"—మరో ఆడపిల్లల తండ్రి ఉక్రోషం.

జగన్నాథ్‌కు కోపం వచ్చింది ఆ ఆడపిల్లల తండ్రి అలా అన్నందుకు కాదు. మరి ఈ చక్రవర్తి నంబర్ టూ ఎవడా? అని అంతే జనాన్ని తోసుకొని లోపలికెళ్ళాడు.

అతని గుండెల్లో టైంబాంబ్ పగిలినట్లయింది. రజని—తన చిన్నారి ముద్దుల చెల్లెలు—పదిమందిలో—బజారులో—రోడ్డుమీద పడి—అలా—హే భగవాన్ !!!

జగన్నాథ్ గుండెలు పిండేశాయి.

"అన్నయ్యా!! అసహాయంగా ఆ ఆడబడుచు పిలుపు.

జగన్నాథ్ కళ్ళు తిరిగిపోతున్నాయ్!

ఈ నవ్వులు జగన్నాథ్ ఫ్రెండ్స్‌వి. తనవంక చూస్తూకూడా నవ్వుతున్నారు రాస్కెల్స్—

అంతలో ఆ గుంపును మరోపక్కనుండి తోసుకువచ్చిన సురేష్—"రజనీ! నువ్వు—పదిమంది మధ్య—యిలా — యిక్కడ — ఛీ, ఛీ!!" ఛీత్కారం చేస్తూ వెళ్ళిపోయిన దృశ్యం—

'అయ్యో! భగవంతుడా!" చెల్లెలి ఆక్రందన—

గుండె గొంతులోకి వచ్చింది.

'రజనీ!' అని గావుకేక పెట్టాడు జగన్నాథ్ కొండను పిండిచేసే అరుపు అది. వంటింట్లోంచి పరుగెత్తుకొచ్చింది జానకమ్మ జగన్నాథ్ గదిలోకి—

"ఏమయింది బాబూ? ఎందుకలా గావుకేక పెట్టావ్??" పడుకొని వున్న కొడుకును రెండు చేతుల్లో పట్టుకొని కుదిపింది తల్లి.

"అమ్మా! రజని ఏది?"

'మాలతి యింటికెళ్ళింది ఏం బాబూ?'

ఏదో పీడకల—లాంటి—నిజం—'అంటూ కళ్ళు తెరిచాడు జగన్నాథ్!

–'ఇక్కడున్నావా అమ్మా! నేను నేరుగా వంటింట్లోకి వెళ్ళొస్తున్నాను'—నేస్తం యింటికెళ్ళొచ్చిన రజని నిక్షేపంగా కనిపించింది జగన్నాథ్ కళ్ళకు.

'అన్నయ్య నిద్రలో కలవరిస్తేనూ — లే బాబూ! లేచి ముఖం కడుక్కో—కాఫీ తెస్తాను' అంటూ జానకమ్మ వంటింట్లోకెళ్ళిపోయింది.

'ఏం అన్నయ్యా! పగటి కలలు కంటున్నావా?'

జోత్స్నలా మెరిసిపోతున్న చెల్లెల్ని కళ్ళార్పకుండా చూశాడు జగన్నాథ్ హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. రజనీని తదేకంగా చూస్తూనే రజనిలో అరుణ సాక్షాత్కరించింది!!!

అరుణ · —

'అమ్మాయ్! సంధ్యదీపం వెలిగించు'—జానకమ్మ కేక వేసింది.

'ఏమిటన్నయ్యా! అలా చూస్తూ ఆగిపొయ్యావ్? యింకా నిద్ర మత్తు వదల్లేదా? లేచి ముఖం కడుక్కో!' అంటూ వెళ్ళిపోయింది రజని.

చివ్వున లేచాడు—

గది దాటి వచ్చిన జగన్నాథ్‌కు కనిపించిన కమనీయ దృశ్యం! పరిశుభ్రమైన రజని బొట్టు పెట్టుకుని, దీపం వెలిగించి, భక్తిగా నమస్కరిస్తోంది. ఆ జ్యోతిలో అరుణ దర్శనమిచ్చింది జగన్నాథ్‌కు.

'అవును, అరుణ క్షమ లభించకపోతే—తను మనిషి కాడు.'

'రజనీ! యిప్పుడే వస్తాను అమ్మతో చెప్పు'– అంటూ వెలుపలికి వెళ్ళిపోయాడు జగన్నాథ్.

"అన్నయ్యా! త్వరగా వచ్చెయ్!" పువ్వులను దీపం ముందు పెడుతూ అన్నది రజని.

★